# ఏలినాటి శని

అంట్లగిన్నెలు ముందేసుకుని వాడిన ముఖంతో దిగాలుపడి కూర్చుంది మంగమ్మ. అయిదు నిముషాలు గడచినా దానికి వాటిమీద చెయ్యి వెయ్యబుద్ధికాలేదు. రాత్రి తిండీ, నిద్రా లేదు. ఒంట్లో చచ్చేంత నీరసంగా ఉంది. కాళ్లు, చేతులు స్వాధీనంలోకి రావడం లేదు. రాత్రి తిన్న దెబ్బలకి ఒంట్లో శక్తి సన్నగిల్లినా మనసు మాత్రం పిండిమరలో చక్రంలా చరచర తిరుగుతున్నాది. సమయం గడుస్తున్నకొద్దీ ఏదో తెలియని భయం. బెంగ చుట్టుముట్టి మంగమ్మ మనసుకి శాంతి లేకుండా చేస్తున్నాయి. తన ప్రాణానికి ప్రాణం అయిన బుచ్చిగాణ్ణి తలుచుకొనేసరికి ఆ తల్లి ప్రాణం గిలగిల కొట్టుకొన్నాది. చెప్పలేని దిగులు ముంచుకొస్తున్నాది. ఆ వాతావరణంలో, ఆ ఇంట్లో బుచ్చిగాడు ఇలాగే పెరిగి పెద్దవాడైతే... తండ్రిలాగే వాడు కూడా... ఇంక ఊహించుకోలేక పోయింది. మంగమ్మ. ఆ ఆలోచనకే ఆమె కళ్లు చిల్లుముంతలయేయి. అడ్డూ, ఆపు లేకుండా నీళ్లు బొలబొల కారేయి.

"మంగీ, ఇంకా యిలాగే కూర్చున్నావుటే.. వంటకి వేళైపోతున్నాది. ఆ కూరగిన్నే, చారుగిన్నే త్వరగా తోమిపడేయి. మళ్లీ మీ బాబుగారు వంట కాలేదని చిందులు తొక్కుతారు" అంటూ పెరట్లోకి వచ్చింది అన్నపూర్ణ.

"ఏంటమ్మగోరో మీరు కుంపటి రాజేసి, తానం చేసి వచ్చేతలికి ఆపాటి గిన్నెలే తోమియ్యనేకపోతానా? పెట్టనంతసేపేకాని,సేయి పెట్టేనంటే పసయిపోయినట్లే గంద" అంటూ మంగమ్మ నుంచి జవాబు వస్తుందని ఎదురుచూసిన అన్నపూర్ణకు, చలనం లేకుండా రాతిబొమ్మలా మంగమ్మ అలా కూర్చునేసరికి అసలు విషయం అర్థమయింది.

"ఏమయిందే మంగీ... మళ్లా మీ వాడు తాగొచ్చేడా?" అంది అనునయంగా. ఆపాటి సానుభూతికే మంగమ్మ మనసులోని బాధ కరిగి కన్నీరుగా ప్రవహించింది.

"మళ్లీ అన్నమాటే ముందమ్మగోరో.... రోజూ ఉండే బాగోతమే గంద" అంది మంగమ్మ కళ్లు తుడుచుకొంటూ.

"మరి అలా అని సర్దుకుపోయేదానివి... ఇవాళేం ఇలా ముఖం వేలేసేవు?"

"ఏటిసేదమ్మా, నిన్నాడు తాగొచ్చేతలికి బుచ్చిగాడింకా తొంగోనేదు. ఆడు తండ్రిని చూసి..." మంగి కంఠంలోంచి మాట తిన్నగా పెగిలిరాలేదు.

"ఊ.... చూసి..."

"నన్ను కొట్టేదని అడ్డంపోతే, ఆడికి కూడా నాలుగంటించిండు. బిడ్డకి ఒంటిమీద తెలివి నేకుండా జొరం వచ్చి పడ్డాది. మల్లా తెల్లారి డాకటేరు దగ్గరికి తనేపోయి మందట్టుకొచ్చిండు. పనిలోకి పోకుండా ఆడి మంచం కాడనే మతిపోయి నాడిలా కూకున్నాడు. కాని ఏటినాబం, సీకటి పడ్డాదంటే మల్లా పాతపాటే" అంది మంగమ్మ నిస్పృహగా.

అన్నపూర్ణ మంగిని ఇంత పిల్లప్పటినుంచి తెలుసు. దాని అమ్మ వెనకాల పనిలోకి వచ్చి, వీధిలో కళ్ళాపు జల్లడం, తోమిన అంటగిన్నెల్ని కడిగి పెట్టడం వంటి పనులు తల్లికి సాయం చేస్తుండేది. ముసలి అచ్చమ్మ ఆయువు మూడి చచ్చిపోయేక తల్లి ఇళ్ల పనుల్నీ తనే చేసుకోవడం మొదలుపెట్టింది మంగమ్మ.

పక్కవీధి ప్లీడరుగారి తోటమాలి కొడుకు గంగులు – నల్లగా, బలంగా, చలాకిగా ఉంటాడు. వయసులో ఉన్న మంగికి వాడితో నేస్తం ఏర్పడింది. మంగి ఇళ్ళ పనులు ముగించుకొని వెళ్లేవేళ, గంగులు తను పనిచేస్తున్న మిల్లునుండి తిరిగొచ్చేవేళ తరచు ఒకటే అయేది. ఇద్దరూ ఆ కబురూ, ఈ కబురూ చెప్పుకొంటూ కలసి తమ గూడెం వైపు పోయేవారు. ఆరోజుల్లో మంగి నోరు విప్పితే చాలు గంగులి కబుర్లే చెప్పేది. "ఇంతలా మురిసిపోతున్నావు. మీ కులమే గద పెల్లి చేసేసుకో" అనేది అన్నపూర్ణ.

"ఆడి అమ్మా, నాన్న ఆడగరావాలి గద" అనేది మంగి సిగ్గుతో తలదించుకొంటూ.

అటు తరువాత కొంతకాలానికి వాళ్లు అడగడం, మంగి పెత్తల్లి అవునని తలూపడం, మంగికి గంగులుకి మనువు జరిగిపోవడం, అన్నీ ఒకటి తరువాత ఒకటిగా పూర్తయేయి.

"అమ్మగారో... ఓ నాల్రోజులు చెలవుకావాలి" అంది మంగి పెళ్లికూతురి సిగ్గుతో తలదించుకొంటూ.

"ఏమే మంగీ... గంగులూ, నువ్వూ హనీమూన్ పోతారేమిటి?" అంది అన్నపూర్ణ నవ్వుతూ.

ఆ మాటకి అర్థం ఏమిటో మంగికి తెలియలేదు. ఏదోలే అమ్మగారు హాస్యం ఆడుతున్నారు అనుకొంది.

"సింహాచలం కొండెక్కిత్తానని మాయమ్మ మొక్కిందట. పెద్దమ్మ ఓపాలి పోయిరమ్మటున్నాది" అంది.

అప్పన్న మొక్కు తీర్చుకొని వారం నాటికి వాడిన ముఖంతో తిరిగొచ్చింది మంగి.

"ఏమిటే మంగీ... వారం నాటికే వడకొట్టినట్లు ఇలా అయిపోయేవు?" అంది అన్నపూర్ణ చలోక్తిగా.

మంగి నునుసిగ్గు దొంతరల చాటుగా ఏదో జవాబు చెప్తుందనుకొన్న అన్నపూర్ణకి అది బాధగా తల వాల్చేసరికి ఏమీ అర్థంకాకుండా పోయింది.

"ఏమయిందే మంగీ" అంటూ ప్రశ్నించింది వింతగా దాని ముఖాన్ని చూస్తూ.

"సీ... సీ... ఎంత సిగ్గుసేటు? మరీ ఎంత ఇదయినా దేవుడిగుడి కంటి ముంగల ఉండగానే ఇంతసేటా" అంది మంగి విరక్తిగా.

గంగులు చిలిపిగా ఏదో చేసుంటాడు. మంగికి కోపకారణం అదే అయి ఉంటుంది అనుకొంది అన్నపూర్ణ. "వయసు అలాటిదే. మరి వెనకా, ముందూ చూడనియ్యదు" అంది చిన్నగా నవ్వుతు.

"అది సరేనమ్మగారు దాని మాటకేంటి.. సిటికెలో తిరగొత్తానని

సెప్పిపోయినోడు ఏడనో, తిరిగి, తిరిగి, తెగతాగి, తెలివినేకుండా అర్ధరాత్రికాడ వచ్చిపడ్డాడు. నోటికొచ్చినట్లల్లా వాగితే ఏరూరుకొంటారు? తిట్లూ, దిరిగుండాలు.... సీ.. ఆడితో నేరకపోయినానని ఏడుపొత్తుంటే" మంగి ముఖమింతచేసుకొని ఆ విషయాలన్నీ చెప్పింది.

"గంగులు తాగుతాడటే" అన్నపూర్ణ ఆశ్చర్యంగా ప్రశ్నించింది.

"అప్పటిదాకా నాకూ తెలవదమ్మా... ఒక్కపూటనేకపోయినా బతకనేడుట. ఆడి నోటితో ఆడే సెప్పిండు" అంది మంగి దిగులుగా.

"ఫరవాలేదే... మరేం కంగారు పడకు. నవ్వుతూ మంచి మాటలు చెప్పి నెమ్మదిగా మాన్పించు. అంతేకాని నువ్విలా ముఖం మాడ్చుకుకూర్చుంటే వాడు మరింతగా పెట్రేగి పోగలడు" అంటూ, హితవు చెప్పింది అన్నపూర్ణ

మంగి ఎంతగా బ్రతిమాలినా... బామాలినా.. నయానా.. భయానా... ఎంత మొత్తుకున్నా గంగులు తాగుడు మానలేదు.

"నీ మాటిని మానేయాలనుకొంటానే మంగీ... కాని ఆ ఏలకి అది పడకపోతే పిచ్చెత్తిపోతాది. ఏటి సెయ్యమంటావు సెప్పు? ఇదొక్కటి తప్పితే నీకేటి లోటు సనేనే..." అనేవాడు గంగులు.

గంగులు అన్నమాట నిజమే. ఆ గూడెంలో మంగిని, దాని ఇంటిని చూసి ఎందరో కళ్లలో నిప్పులు పోసుకొనేవాడు. మంగిపై ఏవో ఉన్నవీ, లేనివీ కల్పించి చెప్పి వారిద్దర్నీ విడదీయాలని ప్రయత్నించేవారు కొందరు. కాని గంగులు చెప్పుడు మాటలు వినేరకం కాదు.

"నా మంగి అగ్గినిప్పు నాటిది, దగ్గరగా కూకుంటే అమ్మఒడిలా ఎచ్చగా ఉంటది. చొరవ చేసి సెయిపెడితే కాల్చిపారేస్తది" అనేవాడు గంగులు గర్వంగా. మంగిని ఎవరైనా ఒక కష్టమైన మాటన్నా... అది దేనికైనా కంటతడి పెట్టినా గంగులు సహించలేక పోయేవాడు. బుచ్చిగాడు కడుపున పడగానే దానిచేత ఇళ్ల పనులన్నీ మానిపించేసేడు. అన్నపూర్ణతో పెరిగిన ఆత్మీయత కారణంగా గంగులు ఎంతచెప్పినా

ఆ ఇంట పని మాత్రం మానలేక పోయింది మంగి.

నెలనీళ్లు పోసుకొన్న దగ్గరినుండి ఎథాప్రకారం వచ్చి తనపని చేసుకుపోడం మొదలుపెట్టింది. పాదులో దోసకాయలా రోజురోజుకి పెరుగుతున్న బుచ్చిగాణ్ని చూసుకొంటూ మిగిలిన అన్ని విషయాలు పట్టించుకోడం మానేసింది మంగి.

గంగులు తాగుడు వ్యసనం వాడి దినసరిరాబడితోపాటు పెరుగుతూ వచ్చింది. ఒక్కొక్కరోజున ఒంటిమీద తెలివిలేకుండా తాగొచ్చి దేనికోదానికి మంగిని కొట్టడం కూడా అలవాటు చేసుకొన్నాడు. కాని తెల్లవారి మత్తుదిగే సరికి మళ్లీ ఎప్పటి గంగులే. మంగిని కొట్టినందుకు చిన్న పిల్లాడిలా దాని కాళ్ల మీద పడి ఏడ్చేవాడు. అది కోపం పోయిందని చెప్తేకాని పనిలోకైనా పోయేవాడు కాదు.

నాలుగురోజుల నాటికి మళ్లా పాత కథే. వాడి తాగుడు వ్యవహారంతో మంగి విసిగిపోయింది. ఇంక వాడి బుద్ధి మారడం కల్ల అనే నిశ్చయానికొచ్చింది. ఇప్పుడు దాని దృష్టంతా పెరుగుతున్న కొడుకుమీదే. వాడిని జాగ్రత్తగా పెంచి పెద్దచేసుకోవాలి. వాడి నీడను తన బ్రతుకు వెళ్లమారిపోవాలి. అదే దాని మనసులో రాత్రి, పగలు నలుగుతున్న ఏకైక కోరిక.

ముందురోజు రాత్రి పక్కింటి నరసయ్య కొడుకును పోలీసులు లాక్కుపోయేరు. అర్ధరాత్రి వేళ ఇంట్లో అంత గొల్లుమన్నారు. ఇంక, వీధిలో చేరినవాళ్లు" అది తండ్రి బుద్దులే ఆడికి వచ్చినాయి. ఆ ఇంట పెరిగి నోడికి మంచి, మర్యాద రమ్మంటే ఏడనుంచి పుట్టుకొత్తాయి. ఏడనో బాగా కాలేసి ఉంటడు. పసికట్టి పోలీసోళ్లు ఈడ్చుకుపోనారు" అంటూ కబుర్లు చెప్పుకొన్నారు.

ఆ మాటలు విన్న మంగి మనసులో పెద్ద బండ పడ్డట్లయింది. "తండ్రి బుద్దులే.. అది తండ్రి బుద్దులే" అన్నమాట చెవుల్లో సముద్రపు హెూరులా రొదపెట్టింది. కొంపతీసి గంగులు తాగుడు అలవాటు బుచ్చిగాడికి కూడా వస్తే.. "అమ్మో... ఓలమ్మో..." ఆ ఆలోచనకే భరించలేక గుండెలు చేత్తో పట్టుకొని ఓ మూల కూలబడింది.

అర్థరాత్రి మీరేక తప్పతాగిన గంగులు ఏదో వాగుతూ ఇంట్లో కాలుపెట్టేడు. వాడిని ఆ స్థితిలో చూసి కోపం పట్టలేక కాళికలా హుంకరించిది మంగి. "నువ్విలా తాగుడు మానేత్తావా? నేక నా బిడ్డని తీసుకొన్ని నే నేడకేనా పోయేదా?" అంటూ ఎదరించింది.

ఒంటిమీద తెలివిలేక గంగులుకి ఆ తల్లి కడుపులో రగులుతున్న మంట ఎలా తెలుస్తుంది?

"ఎదిరించి మాట్టాడం నేర్చేవుటే నంజా" అంటూ కాళ్లా చేతులా దాన్ని తన్ని పోగుపెట్టేడు. బాధని ఓర్చుకోలేని మంగి "ఓలమ్మో సంపేతున్నాడర్రోయి" అంటూ కేకలు పెట్టింది. ఆ కేకలతో నిద్రలో ఉన్న బుచ్చిగాడికి తెలివి వచ్చింది. తండ్రి తల్లిని కొడ్తుండడం చూసి పరుగున అక్కడికి వచ్చేడు. తన చిన్న చేతులతో తండ్రిని అడ్డుకొంటూ "మా యమ్మని కొట్టకు... మాయమ్మని కొట్ట"కంటూ కేకలు పెట్టేడు.

ఫలితంగా వాడూ తండ్రి చేత నాలుగు తన్నులు తిన్నాడు. అలసిపోయేదాకా ఏడ్చి, ఏడ్చి అలాగే నేలమీద పడి నిద్దరోయేడు బుచ్చిగాడు.

తెల్లవారి మళ్లా అంతా మామ్మూలే. తన చేతులతో కొడుకుని కూడా కొట్టినందుకు ఆ రోజంతా పస్తుపడి ఏడుస్తూ కూర్చున్నాడు గంగులు. కాని అందువల్ల అయేదేముంది? అదే మంగి ఆవేదన.

"ఆదు మనిసి నిజంగా చెడ్డోడైతే ఎప్పుడో వొదిలి ఏరే పోయేదాన్నమ్మగోరూ. ఆడి మనసు ఎన్న నాటిది. నానన్నా, బుచ్చిగోడన్నా పానం పెడ్తాడు" అంటూ ఏడ్చింది మంగి.

అన్నపూర్ణ మంగి పరిస్థితి, గంగులు మనస్థితి అర్థం చేసుకొంది. మంగి అన్నట్లు గంగులు మనిషి మంచివాడే. పిల్లాడన్నా, పెళ్లామన్నా వాడికి ఎంతో అభిమానం ఉంది. కాని ఏం లాభం... వాడిలో ఉన్న అన్ని మంచి గుణాల్ని ఆ పాన పిశాచి పొట్టపెట్టుకొంటున్నది. ఊరుకొంటే లాభం లేదు. దీనికేదైన మార్గం చూడాలి– అనుకొంది అన్నపూర్ణ. అప్పటిమట్టుకి మంగికి ధైర్యంచెప్పి ఇంటికి పంపివేసింది.

ఆరోజు అలవాటుగా కల్లుపాకల దగ్గరకి వెళ్లిన గంగులు డబ్బులు కోసం జేబులో చెయ్యి పెట్టేడు. కాళీజేబు గుంభనంగా నవ్వి ఊరుకొంది. "ఆరి తస్సాదియ్యా ఏడోజేబులో డబ్బు కొట్టేసిండు" అనుకొన్నాడు గంగులు. పోన్లే పోతేపోయింది. రాజులు ఆపాటి తనకి అరువియ్యకపోతాడ అన్న ధైర్యంతో పాకలో దూరేడు. ఆరోజు గల్లాపెట్టి దగ్గర రాజులు లేడు. ఇంకెవరో కొత్తవాడు ఉన్నాడు. "చచ్చి గీ పెట్టుకొన్నా అరువిచ్చేసి లేదు - పొమ్మ"న్నాడు.

గంగులు వాడితో కజ్జా పెట్టుకొన్నాడు. తిట్టిపోసేడు. తన్నడానికి తయారయేడు. అయినా ఫలితం లేకపోయింది. ఆ కొత్తవాడు అణుమాత్రమైన చలించలేదు.

ఇంక చేసేది లేక గంగులు ఇంటిముఖం పట్టేడు. ఇంట్లో ముందురోజు చాటుగా తెచ్చిదాచిన కాపుసారా ఉంది. ఆ ముంతడు తాగి ఆ రోజుకి ఎలాగోలాగ గడుపుకోవాలని నిశ్చయించుకొన్నాడు. దాహంతో నోరు ఆర్చుకుపోతుంటే వీధిలోంచే మంగిని పిలుస్తూ ఇంట్లో కాలుపెట్టేడు గంగులు. మంగి పలకలేదు. "ఈ ఏలప్పుడు ఏడకిపోయింది?" తనలో తనే అనుకొంటూ గదిలోకొచ్చేడు.

మంగి, బుచ్చిగాడు ఒంటిమీద తెలివిలేకుండా గదిలో పడున్నారు. పక్కనే కాపుసారా ముంత కాళీగా దొర్లుతున్నాది. ఇల్లంతా ఒకటే కంపు. కక్కు కంపు.... కాపుసారాకంపు... బుచ్చిగాడి బట్టలూ, నోరు అంతా సారావాసనే. క్షణకాలం తన కళ్లని తను నమ్మలేకపోయేడు గంగులు. తను పీడకల కాని కంటున్నాడా అని గిల్లుకొని చూసుకొన్నాడు.

మంగి మత్తులో ఉండుండి ఏదో గొణుగుతున్నాది. మధ్యమధ్య ఎక్కిళ్ళు వస్తున్నాయి. "మంగీ" ఆవేదన గంగులు కంఠంలో గురగురమన్నాది. మతిపోయిన వాడిలా ఆ తల్లీ, పిల్లలవైపు చూస్తూ అలా ఉండిపోయేడు. అతడి కళ్లలో అప్రయత్నంగా నీళ్లు తిరిగేయి.

ఒంటిమీద తెలివిలేని పిల్లణ్ణి ఎత్తి మంచం మీద పడుకోపెట్టేడు. తడిగుడ్డతో వాడి ముఖం తుడిచేడు. "ఒరేయ్ బుచ్చీ... బుచ్చీ..." అంటు అప్యాయంగా తట్టి పిల్చేడు. బుచ్చిగాడికి తెలివిరాలేదు.

ఆ రాత్రంతా గంగులుకి కంటిమీద కునుకులేదు. తన గొంతుకలో చుక్కపడలేదన్న తలంపు కూడా రాలేదు.

రోజులాగే చీకటినే లేచి ఇంటిపనులు చక్కబెట్టింది మంగి. ఇల్లంతా శుభ్రపరచి గంగులుకి చల్ది తెచ్చి ముందు పెట్టింది. ముందు రాత్రి ఏ విశేషం జరగనట్లే తిరుగుతున్న మంగి వంక వింతగా చూసేడు గంగులు. గంగులు చూపుల్ని మంగి పసికట్టింది.

"కూడు తినమని ముందరెడితే, ఏటి నామొకం కాసి సూత్తావు. ఈ ఏల నా మొకాన బొమ్మలాడుతున్నా ఏటి? అంది విదిలింపుగా.

"అబ్బే... అబ్బే... ఏటినేదే ఏదో యోసన సేస్తున్నా - అంతే" అన్నాడు గంగులు.

ఆరోజు తరువాత రాత్రిపూట గంగులు బయటికి పోయింది లేదు. బువ్వ తిన్నాక బుచ్చిగాడితో, మంగితో ఏదో కబుర్లు కథలు చెప్తూ ఇంట్లోనే కూర్చునేవాడు. లేదంటే మంగిని. బుచ్చిగాణ్ణి సినిమాకో, బజారుకో తీసుకుపోయేవాడు. నెలనాడు జీతం అందుకొని రెండు చెడ్డీలు, రెండు జుబ్బాలు కొన్నాడు. తనకో కమీజు కొనుక్కొన్నాడు.

"ఈ ఏల బోనసొచ్చిందేటి మావా.... ఇన్ని బట్టలు కొన్నావు" అంది మంగి గంగుల్ని క్రేగంట చూస్తూ.

"ఇంక నెలనెలా మనకి బోనసేనే" అన్నాడు గంగులు ఖుషీగా.

మరునాడు పనిలోకి పోతూ ఇన్ని పళ్లూ పువ్వులు తీసుకుపోయి అన్నపూర్ణ కాళ్ల ముందు పెట్టింది మంగి.

"ఇదేమిటే ఏమిటిదంతా" అంది అన్నపూర్ణ

"మీ దర్మాన ఆదుపూర్తిగా మారిపోనాడమ్మా .... ఈ నెల్లో ఒక్కసారికూడా అటుపోనేదు" అంది సంతోషంగా.

"పోన్లే ఇంక నీబెంగ తీరినట్లేనా?" అంది అన్నపూర్ణ

"ఆ ఏల మీ సాయంనేకపోతే నేనింత నాటకం ఆడగలనా అమ్మా! మీరిచ్చిన మాత్తరేస్తే బుచ్చిగాడు ఒకటే నిద్దరోయేడు. పాపం మావ ఆడు తాగిపడున్నాడనుకొని రేత్తిరంతా ఆడికాడనే కూకున్నాడు. మల్లా తెల్లారి నేచి నన్ను ఒక్కమాటన్లేదు. ఏటి జరగనట్లే ఉండిపోనాడు. కాని ఆ ఏలంతా ఏదో యోసన చేస్తూనే ఉన్నాడు. నేసెప్పనేదమ్మా... మావ చాల మంచోడని! ఆ కల్లుపాక మల్లిగాడు కూడా మానిబద్దయిన మనిసమ్మా... పుచ్చుకొంటే పదిరూపాయలుచ్చుకొన్నాడు కాని మావ చచ్చిగీపెట్టకొన్నా ఒక్కగుక్క పొయ్యనేదుట. నేకుంటే మన పానంతా పాడయిపోయేది గందా?" అది మంగి ఉత్సాహంగా.

"వాడిబుద్ధి మారేవేళకి అన్నీ అలా కలసొచ్చేయి... అంతకన్న మరేంలేదు" అంది అన్నపూర్ణ.

"అమ్మగోరూ... ఓ నాల్రోజులు చెలవు కావాలి" అంది మంగి నసుగుతూ.

"మళ్లా సింహాచలం మొక్కేనా?"

"అదేనమ్మా ఆడు తాగుడుమానేత్తే కొండెక్కుతానని...."

"సరే వెళ్లిరా... కాని మళ్లాకిందటి మాటులా ముఖం ముడుచుకొస్తే మాత్రం ఊరుకోను. తెలిసిందా?"

"ఇంకానా అమ్మగోరూ.. ఆదేదో ఏలినాటి చనిట అది ఒగ్గేసిందని. ఆ పెంకుటింటి బాపనయ్య నిన్న సెప్పిండు; కట్టాలేటి రావుట" అంది మంగి తేలిగ్గా గాలిపీలుస్తూ...

– ఆంధ్ర సచిత్రవార పత్రిక